

నేడు యువతకు ఉపన్యాస పోటీలు

శ్రీకాకుళం : జాతీయ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్స్-2024 కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం కోసం ఈనెల 17న ఉపన్యాస పోటీలను నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్‌లో వర్చువల్ మోడ్‌లో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు గల యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ టు వికసిత్ భారత్, మేకింగ్ ఇండియా ఎ గ్లోబల్ లీడర్ ఎంపోరింగ్ ది ఫ్యూచర్ అనే అంశాలపై ఉపన్యాస పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో గెలుపొందిన విజేత రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయిలో విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు.

గ్రామీణ బంద్ విజయవంతం

- పారిశ్రామిక కార్మికుల సమ్మె సక్సెస్
- జిల్లావ్యాప్తంగా ప్రదర్శనలు, బైక్ ర్యాలీలు
- కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాల హోరు
- సంఘీభావం తెలిపిన వామపక్షాలు



శ్రీకాకుళం : బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, యంత్రాంగం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన శుక్రవారం చేపట్టిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతమైంది. జిల్లావ్యాప్తంగా ప్రదర్శనలు, బైక్ ర్యాలీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. మోడీ ప్రభుత్వ కార్మిక, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలని... పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని... నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ పెద్దపెట్టున నినదించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు ఆయా కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించి సమ్మెకు తమ మద్దతు తెలిపారు. జిల్లాలో పలుచోట్ల నిర్వహించిన ర్యాలీలకు వామపక్ష పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు.



కోటబొమ్మాళి : ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

శ్రీకాకుళం నగరంలో ఏడు రోడ్ల కూడలి నుంచి జిటి రోడ్డు మీదుగా సూర్యమహల్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు సంఘీభావం తెలిపారు. అనంతరం సభ నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి తాండ్ర అరుణ, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు మాట్లాడారు. ఢిల్లీలో రైతాంగం చేసిన పోరాటం సందర్భంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటకు కనీస మద్దతు ధర చెల్లిస్తామన్న హామీని బిజెపి ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. కేరళ తరహా రుణ విమోచన చట్టం తీసుకురావాలని, అన్ని బ్యాంకింగ్ సంస్థల నుంచి ఒకేసారి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మూడు రైతు చట్టాల రద్దు సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సుదీర్ఘకాలంగా సంయుక్త కిసాన్ మోర్చా చేస్తున్న డిమాండ్లను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉపాధి హామీని ఎత్తివేయాలని బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని చెప్పారు. సిఐటియు, రైతుసంఘం, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, నాగార్జున అగ్రికం, పెన్షనర్స్, భవన నిర్మాణ, కళాసీ, జన విజ్ఞాన వేదిక, మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్లు, ప్రజాసంఘాల నాయకులు డి.కృష్ణారావు, ఎన్.గణపతిరావు, ఎం.గోవర్ధనరావు, ఎల్.వరదరాజు, వై.గోపాలుడు, కె.సూరయ్య, కె.అప్పారావు, డి.పార్వతీశం, ఎం.ఆదినారాయణమూర్తి, డి.వి.టి రాజు తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద

సమ్మెలో భాగంగా బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు సూర్యమహల్ కూడలిలోని స్థానిక కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎం.గోవర్ధనరావు, పి.వెంకటరావు మాట్లాడారు. సమ్మెకు బిఎస్ఎన్ఎల్ పూర్వ జిల్లా కార్యదర్శులు వెంకటరావు పాణిగ్రాహి, ఎం రమేష్, పోస్టల్ ఉద్యోగ సంఘం నాయకులు గణపతి, జ్యోతీశ్వరరావు, చంద్రశేఖర్ సంఘీభావం తెలిపారు

శ్రీకాకుళం ప్రధాన తపాలా కార్యాలయం వద్ద

నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో పనిగంటలు ముగిసిన తర్వాత పోస్టల్ ఉద్యోగులు ఆందోళన నిర్వహించి కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోస్టల్ ఉద్యోగ సంఘాల నాయకులు యు.వి రమణ, గణపతి, బాబూరావు, పోస్టల్ పెన్షనర్స్ సంఘం నాయకులు చంద్రశేఖర్, జ్యోతీశ్వరరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



సోంపేట : ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

కోటబొమ్మాళిలో కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక హక్కులను కాలరాస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు విమర్శించారు. కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి రైతుబజారు వరకు నిర్వహించిన ర్యాలీకి సంఘీభావం తెలిపారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ కార్మికులు అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చిందన్నారు. కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి స్వస్తి పలికి 12 గంటల పని విధానాన్ని అమల్లోకి తేవాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్కీమ్ వర్కర్లకు గ్రాట్యుటీ అమలు చేయాలని, కాంట్రాక్ట్, కార్మిక వ్యవస్థను రద్దు చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు టెక్కలి డివిజన్ నాయకులు హెచ్.ఈశ్వరరావు, నాయకులు గొండు నీలన్న, బోర శ్రీనివాసరావు, సనపల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలంలో పైడిభీమవరం నుంచి రణస్థలం వరకు బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం రామతీర్థం జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, నాయకులు ఎం.అప్పలనర్సయ్య, ఎం.ఈశ్వరరావు, డి.ఎల్ నాయుడు, పి.రామకృష్ణ, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, నాయకులు ఎన్.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

మందసలో ఎస్ఆర్ఎస్ఎం జెడ్‌పి హైస్కూల్ నుంచి వాసుదేవ ఆలయం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కొర్ల హేమారావు చౌదరి, మజ్జి బాబూరావు, కె.కేశవరావు, టి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరులో నగరంపల్లిలో నిర్వహించిన ర్యాలీలో సిపిఎం నాయకులు ఎన్.మోహనరావు, రైతుసంఘం నాయకులు బి.రామకృష్ణ, కౌలురైతు సంఘం నాయకులు బి.ఆనందరావు, ఎన్.ఈశ్వరమ్మ, ఐద్వా నాయకులు బి.సుగుణవతి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో తొలుసూరిపల్లి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం ధర్నా చేపట్టారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు, రైతుసంఘం నాయకులు కొల్లి ఎల్లయ్య, పోలారావు, బి.వాసు, ఎస్.కృష్ణ, భవణ నిర్మాణ సంఘం నాయకులు డి.లక్ష్మీనారాయణ, తిర్లంగి అప్పన్న, గ్రానైట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పోలయ్య, వికలాంగుల సంఘం నాయకులు జి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో మండల కేంద్రంలో చేపట్టిన ప్రదర్శనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, పలు సంఘాల నాయకులు చిన్నారావు, రాజు, జ్యోత్స్న, గౌరమ్మ, నిమ్మక అప్పతన్న తదితరులు పాల్గొన్నారు.

పలాసలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, సిఐటియు నాయకులు ఎన్.గణపతి, జీడిరైతుల సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్‌కుమార్, పలు సంఘాల, వామపక్షాల నాయకులు సిహెచ్.వేణుగోపాల్, వి.మాధవరావు, టి.సన్యాసిరావు, ఎం.రామారావు, పి.కుసుమ తదితరులు పాల్గొన్నారు.

పొందూరులో వ్యవసాయ మార్కెట్ యార్డు జంక్షన్ వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, మండల కన్వీనర్ అప్పలనాయుడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి బి.జ్యోతి, ఎ.అనురాధ, డి.తవిటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోంపేటలో జామి ఎల్లమ్మ గుడి నుండి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం అక్కడ నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు టి.హైమ, హేమలత, మోహిని తదితరులు పాల్గొన్నారు.




కోటబొమ్మాళి : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

త్వరితగతిన సమీకృత కలెక్టరేట్ పనులు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సమీకృత కలెక్టరేట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. నగరంలో నిర్మాణంలో ఉన్న సమీకృత కలెక్టరేట్ భవన భవన సముదాయాన్ని ఆర్అండ్‌బి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. తుది దశ నిర్మాణంలో ఉన్న అన్ని బ్లాక్‌లను స్వయంగా పరిశీలించి, రోజువారీ పనిచేస్తున్న వారి సంఖ్యను రెట్టింపు చేయాలని సూచించారు. ఈ నెలాఖరుకు నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందని, ఇంకా 25 శాతం మిగిలి ఉన్న పనులను ఎప్పటికి పూర్తి చేస్తారని కాంట్రాక్టర్లను ప్రశ్నించారు. సివిల్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయని, ఈ నెలాఖరు నాటికి గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులను పూర్తి చేసి అప్పగిస్తామని వారు తెలిపారు. నిధుల కొరత ప్రసక్తే లేదని, పనులు ఆలస్యం చేస్తే బిల్లులు నిలిపివేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ఇక నుంచి ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్షిస్తామని, నాణ్యతలో రాజీ లేకుండా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, ఇఇ రవినాయక్, డిఇఇ ఎం.ఎల్.వి సాగర్, ఎఇఇ పి.టి.రాజు, కాంట్రాక్టు ప్రతినిధి ప్రసాద్ తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న బిఆర్ఎయు విసి రజనీ తదితరులు

విద్యకు ప్రభుత్వ ప్రాధాన్యత

ప్రజాశక్తి - శ్రీకాకుళం

యువతకు, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారిని విజ్ఞానవంతులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. అమరావతి నుంచి విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచస్థాయి వర్సిటీ కోర్సులను ఆన్‌లైన్‌లో అందించే ప్రముఖ ఈ-లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ ఎడెక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. దీనివల్ల మారుతున్న శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు సమాజిక, సాంఘిక శాస్త్రాలకు సంబంధించి పలు సబ్జెక్టులను మన విద్యార్థులు ఉచితంగా నేర్చుకునే అవకాశం కలుగుతుందన్నారు. విదేశాలకు వెళ్లి అక్కడి మేటి కళాశాలల్లో చదువుకోలేని విద్యార్థులు హార్వర్డ్, ఎంఐటి, కొలంబియా, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స తదితర యూనివర్సిటీలు రూపొందించిన కోర్సులను సులభంగా నేర్చుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. రాష్ట్రంలోని 12 లక్షల మంది విద్యార్థులు సుమారు రెండు వేల స్వల్పకాలిక కోర్సులను ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా నేర్చుకొని మంచి ఉద్యోగావకాశాలు పొందే వీలుందన్నారు. ఈ నూతన అభ్యసనా విధానాన్ని మరింత సమర్థవంతంగా, విద్యార్థులకు ఉపయోగపడేలా ఆయా విశ్వవిద్యాలయాలు కృషి చేయాలని విసిలకు సూచించారు.

ఉపాధి, నైపుణ్యత, నాణ్యత గల ఉన్నత విద్య అందించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇంటర్న్‌షిప్, పాఠ్యాంశాలు, ఆధునీకరణ తదితర వాటిని అమలు చేసినట్లు చెప్పారు. నాక్ గుర్తింపును రాష్ట్రంలోని సుమారు 437 విద్యాసంస్థలు సాధించడం ఇతర రాష్ట్రాలకే గర్వకారణమన్నారు. కలెక్టరేట్ నుంచి బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని, రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, సిహెచ్.రాజశేఖరరావు, సిడిసి డీన్ పి.సుజాత, ఎం.అనురాధ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్, అసిస్టెంట్ డీన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్యూలైన్లో బారులు తీరిన యాత్రికులు

వెలుగులరేడు వేడుకలు
వైభవోపేతం



- కన్నులపండువగా సూర్య జయంత్యుత్సవం
- అరసవల్లికి భారీగా తరలివచ్చిన యాత్రికులు
- సామాన్యులకు గంటల తరబడి నిరీక్షణ
- ఇంద్రపుష్కరిణి వద్ద ఏర్పాట్లు శూన్యం
- దేవాదాయశాఖ తీరుపై మండిపడ్డ యాత్రికులు
- పోలీసుల అత్యుత్సాహంతో చేదు అనుభవం

పోలీసుల అత్యుత్సాహం... యాత్రికులకు చేదు అనుభవం



పోలీసులతో ఎమ్మెల్సీ విక్రాంత్ వాగ్వివాదం

పోలీసుల మితిమీరిన ఆంక్షలతో యాత్రికులు తీవ్ర పాట్లు పడ్డారు. నిర్వహణ ఏర్పాట్ల మొత్తం పోలీసులే తమ చేతుల్లోకి తీసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనల విషయంలో ఈసారి పోలీసులు మరింత అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రతి ఏడాదీ అరసవల్లి తోట వరకు వాహనాలను అనుమతించేవారు. ఈసారి అరసవల్లి మిల్లు కూడలి వద్దే వాహనాలను ఆపేశారు. దీంతో యాత్రికులు, స్వచ్ఛంద సేవలందించేందుకు వచ్చిన నిర్వాహకులు ఇబ్బంది పడ్డారు. వివిఐపిలకు సైతం చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఆలయ దర్శనానికి వచ్చిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను అరసవల్లి మిల్లు జంక్షన్‌లో పోలీసులు నుంచి పరాభవం ఎదురైంది. పాసు లేదన్న కారణంతో శ్రీకాకుళం తహశీల్దార్ వై.వి రాణిని పోలీసులు గంటన్నర సేపు అరసవల్లి తోట వద్ద అడ్డుకున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి 12.30 గంటలకు ప్రారంభమైన క్షీరాభిషేక సేవ శుక్రవారం ఉదయం 7.10 గంటల వరకు సాగింది. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదారతో తయారు చేసిన పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో మూలవిరాట్టుకు క్షీరాభిషేకం చేశారు. విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి వేడుకలు ప్రారంభించారు. ప్రభుత్వం తరుపున దేవాదాయ శాఖ ప్రాంతీయ సంచాలకులు ఎం.విజయరాజు, జిల్లా సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, ఆటయ ఇఒ డి.ఎల్.వి రమేష్ స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. రథసప్తమి వేడుకలను కనులారా వీక్షించేందుకు అర్ధరాత్రి నుంచే రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఒడిశా నుంచి వేల సంఖ్యలో యాత్రికులు చేరుకున్నారు.

బెడిసికొట్టిన టైమ్ స్లాట్ విధానం

సందర్శకుల రద్దీని నియంత్రించేందుకు ఈసారి కొత్తగా తీసుకొచ్చిన టైమ్ స్లాట్ విధానం బెడిసికొట్టింది. టైమ్ స్లాట్ విధానంపై అటు యాత్రికులు, ఇటు పోలీసులకు అవగాహన కల్పించడంలో దేవాదాయశాఖ విఫలమైంది. దీంతో అందరూ ఒకేసారి దర్శనానికి రావడంతో క్యూలైన్లు కిక్కిసిరిపోయాయి.

ఆదిత్యుని జయంతి వేడుకల్లో సాధారణ సందర్శకుల కష్టాలు పునరావృతమయ్యాయి. సామాన్య యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా దర్శనం కల్పిస్తామని అధికారులు చేసిన ప్రకటనలు మాటలకే పరిమితమయ్యాయి. ఎప్పటిమాదిరిగానే వివిఐపి సేవలో అధికారులు, పోలీసులు తరించారు. సామాన్య యాత్రికులను గాలికొదిలేశారు. ఉచిత దర్శనం మార్గంలో ఒక కంపార్ట్‌మెంట్ నుంచి తర్వాత కంపార్ట్‌మెంట్‌లోకి సందర్శకులను విడిచిపెడుతున్న సందర్భంలో తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. సాఫీగా దర్శనం చేసుకుందామని రూ.500 పాసు తీసుకున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్షీరాభిషేకం టికెట్లు తీసుకున్న వారికీ అవస్థలు తప్పలేదు. వివిఐపి క్యూలైన్‌లో ఎప్పటిమాదిరిగానే పోలీసులు, పలు ప్రభుత్వ శాఖలకు చెందిన సిబ్బంది తమ కుటుంబ సభ్యులను దగ్గర ఉండి దర్శనం చేయించడంలో తలమునకలయ్యారు. ఆలయానికి వచ్చే యాత్రికులకు క్యూలైన్ల వద్ద తాగునీటి సౌకర్యం అందుబాటులో లేక ఇబ్బందులు పడ్డారు. ఉచిత దర్శనానికి మూడు గంటలకు పైగా సమయం పట్టడం ఎండ తీవ్రత అధికంగా ఉండడం వల్ల యాత్రికులు అసహనానికి గురయ్యారు. పిల్లలకు పాలు అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారులు ఆదేశించినా దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోలేదు.

ఆదిత్యుని దర్శించుకున్న ప్రముఖులు

ఆదిత్యున్ని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ఎంపీలు కింజరాపు రామ్మోహన్ నాయుడు, బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, కరణం ధర్మశ్రీ, గొర్లె కిరణ్ కుమార్, వి.కళావతి, కంబాల జోగులు, తెలంగాణ రాష్ట్రం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కళింగ, తూర్పు కాపు, కళింగ వైశ్య కార్పొరేషన్ల చైర్మన్లు పేరాడ తిలక్, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, ఎస్‌పి జి.ఆర్ రాధిక తదితరులు కుటుంబ సభ్యులతో సందర్శించారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

సాధారణ సందర్శకులకు సాఫీగా దర్శనం కల్పించడంలో దేవాదాయశాఖ విఫలమైందన్న విమర్శలు వినిపించాయి. జయంత్యుత్సవాల నిర్వహణకు దేవాదాయశాఖ ప్రత్యేక అధికారి సురేష్‌బాబు, ఆలయ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, పూర్వ ఇఒ హరి సూర్యప్రకాష్‌కు సహాయంగా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ బలివాడ ప్రసాద్ పట్నాయక్‌ను నియమించారు. ప్రోటోకాల్ వ్యవహారాలు అరసవల్లి ఇఒ చూసినా మిగిలిన ఇద్దరూ అనివెట్టి మండపంలోనే కనిపించారు. క్యూలైన్‌లో సందర్శకులు ఏం ఇబ్బందులు పడుతున్నారో చూసే నాథుడే కరువయ్యాడు.

యాత్రికులకు సేవలందించిన స్వచ్ఛంద సంస్థలు

అరసవల్లి వచ్చిన యాత్రికులకు పలు స్వచ్ఛంద సంస్థలు సేవలు అందించాయి. అరసవల్లిలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఇంటి వద్ద భారీ అన్నదానం చేపట్టారు. పలు స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగ, పులిహోరా, భోజన సదుపాయం కల్పించాయి.

ఇంద్రపుష్కరిణి వద్ద ఏర్పాట్లు శూన్యం

రథసప్తమి సందర్భంగా అరసవల్లి వచ్చే మహిళా యాత్రికులు ఇంద్రపుష్కరిణి వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. సూర్య నమస్కారాలు ఆచరిస్తుంటారు. ప్రస్తుతం ఇంద్రపుష్కరిణి ఎండిపోవడంతో పూజా కార్యక్రమాలు చేయలేకపోయారు. తమ వెంట తెచ్చుకున్న సామగ్రిని తమతోనే తీసుకువెళ్లిపోతూ ఉసూరుమన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు కొంతమంది స్నానాలు ఆచరిస్తుంటారు. ఇంద్రపుష్కరిణి పూర్తిగా ఎండిపోవడంతో స్నానాలకూ తీవ్ర ఇబ్బందిపడ్డారు.



ట్రాఫిక్ ఆంక్షలతో నగర ప్రజలకు నరకం

ఆదిత్యుని జయంత్యుత్సవ వేడుకల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు అమలు చేసిన మితిమీరిన ఆంక్షలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. వివిఐపిలకు రాచమార్గం కల్పించేందుకు శ్రీకాకుళం నగరంలో పోలీసులు ట్రాఫిక్ నిబంధనలను అమలు చేశారు. సూర్యమహల్ కూడలి వద్ద ఒక మార్గంలోనే రాకపోకలను అనుమతించారు. భాష్యం స్కూల్, అఫీషియల్ కాలనీ వద్ద మార్గాన్ని పూర్తిగా మూసేశారు. ఏడు రోడ్ల కూడలి వద్ద జిటి రోడ్డు మార్గంలోనూ వన్‌వేను అమలు చేశారు. పోలీసుల అతి ఆంక్షలతో జనం, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా మహిళా కళాశాల రోడ్డులో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. పాఠశాలలకు వెళ్తున్న ఆటోలను సైతం పోలీసులు అడ్డుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలకు భోజనాలను తీసుకువెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులను అడ్డుకోవడంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

పెండింగ్ ఫారాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7 పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. ఎలక్ట్రోరల్ తొలగింపులు, చేర్పులు, మార్పులు, పోలింగ్ సిబ్బంది, ఎన్నికల నిర్వహణ సంసిద్ధతపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఓటర్ల చేర్పులు, తొలగింపులు, పరిశీలన దాదాపుగా పూర్తయిందని తెలిపారు. శతశాతం పూర్తి చేయడానికి నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, పోలింగ్ సిబ్బందిని నియమించి శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఆర్ఒలు, ఎఆర్ఒలు, మాస్టర్ ట్రైనర్స్‌కు జిల్లాస్థాయిలో శిక్షణ పూర్తి చేసినట్లు వివరించారు. ఎస్‌పి జి.ఆర్ రాధిక మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో ఉన్న పరిస్థితులను వివరించారు. రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు తనిఖీలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. బోర్డర్ వద్ద పరిస్థితులు, పోలీసులకు ఎన్నికలకు సంబంధించి మాస్టర్ ట్రైనర్స్ పోలీసు అధికారులకు మూడు రోజులు పాటు శిక్షణ పూర్తి చేశామన్నారు. అవసరమనుకుంటే రిటైర్డ్ పోలీసులు, ఎక్స్ ఆర్మీ సిబ్బందినీ వినియోగించుకునేందుకు వివరాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మిస్తే జీవనోపాధి కోల్పోతాం

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం వద్దని ప్రత్యామ్నాయ బైపాస్ కొరకు పరిశీలన చేయాలని సర్పంచ్ భవిరి రమణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌ని శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే ఎంపిడిఒ ఆర్.వి.రమణను కలిసి వినతిపత్రం అందించి మండల పరిషత్ తీర్మాణం చేయించాలని విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో కొన్ని తరాలుగా నివాసం ఉంటున్నామని, 20 ఏళ్ల క్రితం రహదారి విస్తరణ కోసం మా భూములను కొంతమేర కోల్పోయమన్నారు. ఉన్న కాస్త స్థలంలో చిరు వ్యాపారాలు చేసుకొంటూ జీవనోపాధి పొందుతున్నా మన్నారు. మరలా ఫ్లైఓవర్ నిర్మాణం చేస్తామని కొలతలు వేసి మార్కింగ్ చేస్తున్నారన్నారు. గతంలో చాలా మంది జీవనోపాధి


ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

కోల్పోయి వలసపోయారని, రెండవ విడత జాతీయ రహదారి విస్తరణ అంటే మరల తీవ్ర సష్టాలకు గురవుతామని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదనను విరమించుకొని బైపాస్ రోడ్డు నిర్మాణం చేసి బైపాస్ రోడ్డు ఇరువైపులా ఉన్న గ్రామాలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేసారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస


ఆచార్య ఎన్.జి.రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఎఆర్ఎస్, ఆర్ఎఆర్ఎస్, కెవికెలో పనిచేస్తున్న కాంట్రాక్టు లేబర్ సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం, పట్టణంలో ఆచార్య ఎన్‌జి రంగ పరిశోధనా స్థానం ఎదుట కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆచార్య ఎన్‌జిరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో రీసెర్చ్ స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లేబర్ వివరాలను రీసెర్చ్ స్టేషన్లలో నమోదు చేయాలని, కాంట్రాక్టు లేబర్‌ను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు లేబర్‌కు సంవత్సరం మొత్తం ఉపాధి చూపించాలని, కార్యాలయంలో స్వీపర్ అటెండర్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ కార్మికులకు


ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ఇస్తున్న ప్రమాద సహజ మరణ నష్టపరిహారాన్ని కాంట్రాక్టు లేబర్‌కు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షురాలు ఎన్. సీతామహాలక్ష్మి, కార్యదర్శి త్రివేణి, కె.కృష్ణవేణి, సుజాత, కొండమ్మ, జ్యోతి ప్రసాద్, శ్రీను, అంబటి యుగంధర్, గణపతి పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస


దుర్గారావు (ఫైల్)

పట్టణంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జాడ దుర్గారావు(47) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మరణించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. రైల్వే అండర్ టన్నెల్ వద్ద ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన దుర్గారావును 108 సిబ్బంది జిల్లా కేంద్రంలో రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు భార్య సూర్యరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దుర్గారావు మృతితో పురపాలక సంఘ పరిధి 6వ వార్డు టి.మన్నయ్య పేటలో విషాద ఛాయలు అలముకున్నాయి.

పిఒడబ్ల్యు నాయకులు నీలవేణి మృతి

ప్రజాశక్తి- పలాస


నీలవేణి (ఫైల్)

మండలంలోని నీలావతికి చెందిన ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) జిల్లా కార్యవర్గ సభ్యులు జుత్తు నీలవేణి (55) కిడ్నీ వ్యాధితో శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతికి పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బాదకల ఈశ్వరమ్మ తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ జిల్లా సాయుధ గిరిజన రైతాంగ పోరాటంలో అమరుడైన జుత్తు ఉమాపతి మేనకోడలు, అమరవీరుడు జుత్తు బాలకృష్ణ భార్య నీలవేణి అని అన్నారు. జిల్లా ఉద్యమంలో అనేక నిర్బంధాలు ఎదుర్కొన్నారని అన్నారు. అనతరం పార్టీ తరపున విప్లవ జోహార్లు అర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అరుణోదయ సంస్కృతి సమైక్య జిల్లా కార్యదర్శి కె.సోమేశ్వరరావు, పౌర హక్కుల సంఘం తెప్పల ఢిల్లీరావు, నీలావతి సర్పంచ్ సొర్ర తిరుపతి, మకన్నపల్లి సర్పంచ్ సైనీ. దేశయ్య, ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి కూర్మారావు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అప్పలరాజు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

పశుసంవర్థకశాఖ మంత్రి అప్పలరాజు

నందిగాం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పేదలకు సంక్షేమ పథకాల అందించడంలో వైసిపి ముందు ఉంటుందని పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని నందిగాం-పూండి రోడ్డులో నరేంద్రపురం వంశధార ఎడమ ప్రధాన కాలువపై రూ.1.58 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన బ్రిడ్జిని మంత్రి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైసిపి జిల్లా అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, వైసిపి ఎంపీ అభ్యర్థి పి.తిలక్‌లు కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే తిలక్ పుట్టినరోజు పురస్కరించుకొని పార్టీ కార్యక్రమంలో కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

20న మండల స్థాయి యోగా పోటీలు

పోలాకి: పోలాకి కేంద్రంలో ఈ నెల 20న తాడి దాలెమ్మ, యర్రయ్య ఫౌండేషన్ ఆధ్వర్యాన మండల స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాడి యర్రయ్య తెలిపారు. స్థానిక ప్రజా గ్రంథాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.భీష్మ ఏకాదశి సందర్భంగా ఉదయం నుంచి ప్రజా గ్రంథాలయంలో యోగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 19 సాయంత్రం 5 గంటలలోగా 9346707343 ఫోన్ నంబను సంప్రదించాలని కోరారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందచేస్తున్నట్లు తెలిపారు.

ఆరోపణలు రుజువు చేయగలరా?

ప్రజాశక్తి- రణస్థలం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

లావేరు మండల కేంద్రంలో గురువారం జరిగిన టిడిపి శంఖారావం సభలో నారా లోకేష్ చేసిన ఆరోపణలు రుజువు చేయగలరా అని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సవాల్ విసిరారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రావెల్ దందా చేసి రూ.70 కోట్లు, ఇసుక దందా చేసి రూ.50 కోట్లు సంపాదించానని, అలాగే కోటపాలేం ప్రాంతంలో వందల ఎకరాల భూములు ఆక్రమించానని లేనిపోని ఆరోపణలు చేసారన్నారు. చేసిన ఆరోపణలు రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేయించిన కిమిడి కళావెంకటరావు రుజువు చేయకపోతే ఎచ్చెర్ల నియోజకవర్గంలో తిరగనివ్వనని హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి నుంచి గ్రామస్థాయి నాయకుల వరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందించడమే తప్పా అవినీతికి తావులేదన్నారు. రెండు ఎకరాల భూమి ఉన్న చంద్రబాబు నాయుడు ఈ రోజు ఇన్ని వేలకోట్లు ఎలా సంపాదించారో లోకేష్, కళావెంకటరావు, టిడిపి నాయకులు చెప్పాలన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- కవిటి

ఎంపీ నిధులు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని కవిటికొత్తూరులో రూ.5 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన సిసి రోడ్డును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్నేళ్లుగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ ఎంపీ నిధులతో ఏదో ఒక కార్యక్రమం చేపట్టామని అన్నారు. అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బెందాళం రమేష్, బాసుదేవ్ రౌలో, సంతోష్ పట్నాయక్, మణిచంద్ర ప్రకాష్, కొర్రాయి వాసు, సదానంద రౌలో పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని


ఇచ్ఛాపురం : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

17,21 వార్డుల్లో ఎంపీ నిధుల రూ.5 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాన చేశారు. గొల్లవీధిలో నూతన కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ.5 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీ నిధులతో పట్టణ అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, జన్నెల సంతోష్, కాళ్ల జయదేవ్, జిలానీ, కృష్ణయ్య, సాలీనా ఢిల్లీ, నందిక జాని పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న కౌలు రైతులు

మద్దతు ధరల చట్టం తీసుకురావాలి

జి.సిగడాం : స్వామినాథన్ కమిటీ సిఫార్స్ అమలు చేసి అన్ని పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేయాలని, కేరళ తరహా రుణ ఉపశమన చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా 200 రోజుల పని కల్పించాలని, రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆహారభద్రత చట్టాన్ని పటిష్ట పర్చాలన్నారు. స్మార్ట్ మీటర్లు నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.శ్రీను, డి.పోతయ్య, ఆర్.శివుడు, భాస్కర్, ఎం.శ్రీను, జగదీశ్వరరావు, కోదండ, రాజాబాబు పాల్గొన్నారు.

ఎస్.బి కొత్తూరులో 'సూపర్ సిక్స్'

సంతబొమ్మాళి : మండలంలోని సిద్ధి బెహరా కొత్తూరులో టిడిపి సూపర్ సిక్స్ గడపగడపకు కార్యక్రమాన్ని శుక్రవారం నాయకులు నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి మేనిఫోస్టోతో కూడిన పోస్టర్లను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జీరు భీమారావు, కర్రి విష్ణుమూర్తి, రెడ్డి అప్పన్న, చెట్టి కాంతారావు, తెలుగు యువత అధ్యక్షులు కుచెట్టి భానుప్రకాష్, ఐటిడిపి ప్రతినిధి బెండి అరుణ్‌కుమార్, దుమ్ము రాణాప్రతాప్, ఉప్పాడ ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గుండెపోటుతో చంద్రపతిరావు మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


చంద్రపతిరావు (ఫైల్)

జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు పిట్టా చంద్రపతిరావు (70) శుక్రవారం తెల్లవారుజామున గుండె పోటుతో కన్ను మూశారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విద్యుత్ శాఖలో వివిధ హోదాల్లో పని చేసిన ఆయన విద్యుత్ బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా కొనసాగారు. ప్రస్తుతం జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఆయన కృషి ఫలితంగా జ్యోతీరావు పూలే పార్కు నిర్మాణం, బిసి స్టడీసర్కిల్ నిర్మాణం జరిగింది.

వ్యక్తికి ఏడాది జైలు

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలో పెంటలో 2021లో జరిగిన బంగారం చోరీ కేసులో కాకర్ల కృష్ణకు పొందూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శుక్రవారం ఏడాది పాటు జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించారని ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు. 2021లో పెంటకు చెందిన మక్క యశోద ఇంట్లోకి కృష్ణ చొరబడి బంగారం చోరీకి పాల్పడ్డారని, అప్పటి ఎస్ఐ ఎం.ఎ.అహ్మద్ కేసు దర్యాప్తు చేపట్టి కోర్టులో హాజరుపరిచారని అన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారని చెప్పారు. ఈ వాదనలు మేరకు జడ్జి తీర్పు వెల్లడించారని తెలిపారు.

వాలంటీర్ల పాత్ర కీలకం

కవిటి: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరిస్తూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందజేయడంలో వాలంటీర్లు నిర్వహిస్తున్న పాత్ర కీలకమైనదని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజలకు మెరుగైన సేవలు అందించారని అన్నారు. అనంతరం బొలియాశెట్టి దేవరాజు, చిల్ల డిల్లేశ్వర్ ప్రధాన్‌కు సేవావజ్ర, హత్తి దేవేంద్రో, పి.భారతి,


వాలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు

బి.మాలతీదేవి, బి.లక్ష్మి, బెహరా దుర్యోధనకు సేవారత్న, 385 మంది వాలంటీర్లకు సేవామిత్ర అవార్డులు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ అలివేలు మంగమ్మ, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, మండల కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎఎంసి వైస్ చైర్మన్ వై.నీలయ్య, సర్పంచ్‌లు ఎస్.పి.నారాయణస్వామి, దుగాన భద్రాచలం, బద్రి ప్రకాష్, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలని వినతి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు, భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని అడ్డుకోవాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కోరారు. ఈ మేరకు తహశీల్దార్‌లో డిటి లక్ష్మీనారాయణను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస, పురుషోత్తపురం గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి సర్వే నంబరు 29లో ఎర్ర చెరువు గర్భంలో 26.80 సెంట్లు భూమిని వైసిపి నాయకులు నంబాళ్ల రమేష్, ఇతని తల్లి నంబాళ్ల రూపావతి, మరికొంతమంది అన్యాక్రాంతం చేశారని అన్నారు. కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయంలో నకిలీ సర్వే నంబరుతో డాక్యుమెంట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. విషయంలో పూర్తిస్థాయిలో రెవెన్యూ అధికారులతో దర్యాప్తు చేపట్టి చట్టారీత్యా తగు చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో ఇటీవల ప్రభుత్వానికి సంబంధించిన


వినతిపత్రం అందజేస్తున్న గౌతు శిరీష

భూములు కబ్జాకు గురై విలువైన ప్రభుత్వ ఆస్తులు, ఆలయ భూములు అన్యాక్రాంతమై దోపిడికి గురి అవుతున్నాయని అన్నారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో టిడిపి నాయకులు గాలి కృష్ణారావు, బి.నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవిశంకర్ గుప్తా, కొవ్వూరు సురేష్ కుమార్, జోగ మల్లి పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు పరిశీలన


కూలీలతో మాట్లాడుతున్న ఎపిఒ కేశవరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉపాధి హామీ పనుల్లో ప్రమాణాలు పాటించాలని ఎపిఒ పిట్ట కేశవరావు అన్నారు. మండలంలోని పెద్దబొడ్డపాడు, జీలుగు చెరువు, పల్లెసారథి, డోకులపాడులో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కొలతలు సక్రమంటే గరిష్ట కూలి పొందే అవకాశం ఉంటుందని అన్నారు. కూలీలు సమయ పాలన పాటించాలన్నారు. పనుల్లో ఎటువంటి యంత్రాలు ఉపయోగించరాదన్నారు. చేతి పనిముట్లను ఉపయోగించి పనులు చేపట్టాలన్నారు. జాబ్‌కార్డుదారులందరికీ వంద రోజుల పని కల్పించాలని క్షేత్ర సహాయకుడు సీతారాంకు ఆదేశించారు. అనంతరం కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికల బాండ్లపై సుప్రీం నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


అప్పలసూర్యనారాయణ

ప్రజాస్వామ్య వ్యవస్థలో అవినీతికి ఆస్కారం లేకుండా ఉండేందుకు ఎన్నికల బాండ్లు అంశంలో సుప్రీం కోర్టు సిజెఐ చంద్ర చూడ్ ఇచ్చిన తీర్పు హర్షణీయమని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం అరసవల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఈ తీర్పు ప్రజాస్వామ్య సుందరత్వాన్ని కాపాడేదిగా ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత అవసరమన్న న్యాయం స్థానం ఆలోచన దేశానికి మేలు చేస్తుందన్నారు. రాజకీయ వ్యవస్థలో రాచరికాలు, టోటాలిటోరియన్ ప్రభుత్వాలు, నియంత పాలన వంటి అన్ని రకాలు ఉంటాయని, అందులో అత్యంత ప్రాధాన్యతను ప్రజాస్వామ్య వ్యవస్థ సంతరించుకుందన్నారు. ఈ తీర్పుతో రాజకీయ క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. నాయకులు, ప్రభుత్వం, ప్రజల ఆస్తులకు సంరక్షణగా ఉండాలని, ప్రజాధనాన్ని కొల్లగొట్టే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో పోలవరం నిర్మాణం, నీటి వనరుల అక్రమాలు, పేదలకు ఇళ్లు కట్టిస్తామని నమ్మించి భూసేకరణ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేశారని విమర్శించారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- పొందూరు


నీలమ్మ (ఫైల్)

మండలంలోని తాడివలసకు చెందిన శతాధిక వృద్ధురాలు పైడి నీలమ్మ (101) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. విశాఖలో ఉంటున్న నీలమ్మ చిన్న కుమారుడు పాపారావు ఇంట్లో ఉండేవారు. ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని వస్తున్న నీలమ్మకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. నీలమ్మను స్వగ్రామం తాడివలసలో సాయంత్రం అంతిక్రియలు నిర్వహించారు. నీలమ్మకు ముగ్గురు కుమారులు గణపతి, రమణ, పాపారావు, కుమార్తెలు కృష్ణవేణి, లక్ష్మీనారాయణ, సావిత్రి, గున్నమ్మ, 64 మంది మనవలు, మనవరాళ్లు, మునిమనవలు, మునిమనవరాళ్లు ఉన్నారు. ఉదయం వరకూ ఆరోగ్యంగానే ఉన్నారని, ఒక్కసారిగా గుండెపోటు రావడంతో మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

చెట్ల మాయంపై స్పందనేదీ?

ప్రజాశక్తి- బూర్జ

పాలకొండ-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో మండలంలోని తుడ్డలి, డొంకలపర్త, మల్లిపాడు తదితర గ్రామాల సమీపంలో రహదారికి ఇరువైపుల ఉన్న భారీ వృక్షాలు రాత్రికి రాత్రే నరికేస్తూ తరలించుకుపోతున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం శోచనీయమని ఆయా గ్రామస్తులు విమర్శలు గుప్పిస్తున్నారు అక్రమార్కులు దర్జాగా భారీ చెట్లను నరికేస్తూ తరలిస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భారీవృక్షాలు చౌర్యం అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం


మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణమూర్తిరెడ్డి

ఇచ్ఛాపురం: శాంతినికేతన్ హైస్కూల్‌లో తల్లిదండ్రుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందు గా అమ్మానాన్నలకు ఆయా పిల్లలు పాదాభివం దనం చేశారు. స్కూల్ చైర్మన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి విద్యార్థులకు, తల్లిదండ్రులకు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. తల్లిదండ్రులు, పిల్లల మధ్య ప్రేమభావాన్ని, ఆప్యాయతను, అనురాగాలు పెంపొందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు, తల్లిదండ్రులకు లక్కీ డిప్ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ పట్నాయక్, శంకర్, శ్రీధర్, రాజ్యలక్ష్మి, యశోద, మీనా పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలం రొట్టవలసలో కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో తల్లిదండ్రుల పాదపూజ నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా స్కూల్‌లో విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు పాదపూజలు నిర్వహించి విశిష్టతను వివరించారు. ఎంఇఒలు బాలరాజు, కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులకు ఇటువంటి కార్యక్రమాలు చేయడంతో నైతిక విలువలు మెరుగుపడతాయన్నారు. తల్లిదండ్రులు చెప్పినట్టు నడుచుకుని, పెద్దలను గౌరవిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బెవర కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపిలో వణుకు

నరసన్నపేట : రాజధాని ఫైల్స్ సినిమాతో సిఎం జగన్మోహన్‌రెడ్డి వెన్నులో వణుకుపుట్టిందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వ్యాఖ్యానించారు. ఈ మేరకు నరసన్నపేట టిడిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాజధాని రైతులు పడుతున్న ఇబ్బందులను దృశ్య చిత్రీకరించిన సినిమా రాజధాని ఫైల్స్ విడుదలై ప్రజలు బ్రహ్మరథం పడుతున్న సందర్భంగా ప్రభుత్వం కుట్రపూరితంగా సినిమా నిలుపుదల చేసిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. శుక్రవారం హైకోర్టు చిత్రాన్ని పరివేక్షించి చిత్రం విడుదలకు మళ్లీ శ్రీకారం చుట్టడం చూస్తే నిజం గెలిచిందని అనిపిస్తుందని అన్నారు. ఇది ప్రభుత్వానికి మొదటి ఓటమిగా భావించామన్నారు. ప్రతిఒక్కరూ రాజధాని రైతులు పడుతున్న ఇబ్బందులు కళ్లకు కట్టినట్టుగా సినిమా చిత్రీకరించారని, ప్రేక్షకులు సినిమాను వీక్షించాలని కోరారు.

పలాస : రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో ప్రభుత్వ కుట్రలు కోర్టు తీర్పుతో బద్దలయ్యాయని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు గౌతు శిరీష అన్నారు. అమరావతి విధ్వంసంపై సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపించారని అన్నారు. ఒక పాలకుడి కుట్రలతో ప్రజా రాజధాని ఎలా విధ్వంసం అయ్యిందో చూపించారని పేర్కొన్నారు. రాజధాని ఫైల్స్ సినిమాపై తప్పుడు ఆరోపణలతో సొంత పార్టీ నేతల ద్వారా కేసులు వేశారని అన్నారు.

20 నుంచి దుర్గాభవానీ యాత్ర

పోలాకి : పోలాకిలోని కనక దుర్గా భవానీ జాతర మహోత్సవం ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ధర్మకర్తలు టంకాల శ్రీరాములు భవానీ, పల్లి రాజు భవాని, వెంకట రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు రోజులు భవానీ మాతకు పూజలు, తిరువీధి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రోజూ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పక్కాగా రికార్డుల నిర్వహణ


మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో అన్ని గ్రామ సంఘాలు, స్వయంశక్తి సంఘాల రికార్డుల నిర్వహణ సక్రమంగా, పారదర్శకంగా ఉండాలని, వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్యలో అన్ని గ్రామ సంఘాల రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇచ్చిన అప్పులన్ని శతశాతం రికవరీ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో లీగల్ కో-ఆర్డినేటర్ జానకిరామ్‌తో పాటు అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలో ఫ్లై ఓవర్ దిగువున ఐకాన్ ఆస్పత్రి వద్ద ఈ నెల 18న ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పేడాడ పూర్ణచంద్రరావు, దుప్పల శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె, బిపి, షుగర్, ఎముకలు, కీళ్ల వ్యాధులతో పాటు చెవి, ముక్కు, గొంతులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ ప్రజలతో పాటు మండల ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

18 నుంచి కమ్మసిగడాం జాతర


పెళ్లిరాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలో కమ్మసిగడాం మహాలక్ష్మితల్లి, గురప్పదొరల కళ్యాణం 18వ తేదీ రాత్రి 10:05 గంటలకు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి పెళ్ళిరాట ఆలయకమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం మూడురోజుల పాటు నిర్వహించనున్న జాతరకు సంబంధించి మహాలక్ష్మితల్లి కమ్మవారి కళ్యాణ మండపంలో మేనేజ్మెంట్ కమిటీ సభ్యులతో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా సేవలందించే ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి రాజారవిచంద్ర, వెలిచేటి సూర్యతేజ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, కార్యదర్శులు మన్నె లక్ష్మీప్రసాద్, వెలిచేటి మురళీధర్, వెలిచేటి రాయుడు, మన్నె కృష్ణానందం, వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి, జి.రఘునాథ్, మన్నె తాతీయులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే శిక్షే

ప్రజాశక్తి- టెక్కలి

పనిచేసే ప్రదేశంలో స్త్రీలపై లైంగిక వేధింపులకు పాల్పడితే చట్టరీత్యా కఠినమైన శిక్షలు ఉంటాయని, స్త్రీలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని ఇన్‌ఛార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా వైద్యశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో స్త్రీలను ఎటువంటి లైంగిక


మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

వేధింపులకు గురిచేయరాదన్నారు. లింగవివక్షను రూపుమాపాలన్నారు. ఆడ, మగ మధ్య ఎటువంటి వ్యత్యాసం చూపరాదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం మండల అధ్యక్షులు డి.వి.వివేకానంద, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావు, ఆర్ఎంఒ డాక్టర్ బి.ఆర్.కె.మహరాజ్ పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్ టెక్కలి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జరిగింది. ఈ ఎగ్జిబిషన్‌లో 164 ప్రాజెక్టులు ప్రదర్శించగా కోష్ట శ్రీనారాయణ స్కూల్ విద్యార్థులు సనపల మనోహర్ టీం ప్రదర్శించిన ఎటిఎంలో దొంగతనాలపై యూసింగ్ క్లోరోఫారం అనే ప్రాజెక్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, న్యాయనిర్ణేతల మన్ననలు పొంది రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ ప్రాజెక్టును ఈ నెలాఖరులో చిత్తూరులో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లా తరపున మనోహర్ టీం ప్రదర్శించనుంది. వీరికి గైడ్ టీచర్లుగా మంగ, కె.గోపి వ్యవహరించారు. అతివేగంగా విస్తరిస్తున్న బ్యాంకింగ్ వ్యవస్థలో ఎటిఎంల వినియోగం అనివార్యమైపోయింది. ఈ ప్రాజెక్టు పని విధానం చూస్తే ఏదైనా ఎటిఎంపై దుండగులు దాడికి ప్రయత్నిస్తే ఎటిఎంలో అమర్చిన ఈ సర్క్యూట్‌ను ఉంచినట్లయితే తక్షణమే ఎటిఎం తలుపులు మూసుకుపోయి క్లోరోఫామ్ రిలీజ్ అవుతుంది. రిలీజ్ అయిన క్లోరోఫామ్ వలన దొంగలు స్పృహ కోల్పోతారు. అదే సమయంలో ఇన్ఫర్మేషన్ పోలీస్ డిపార్ట్మెంట్‌కు చేరవేస్తుంది. వెంటనే పోలీసులు వచ్చి దొంగలను పట్టుకోగలుగుతారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల నారాయణ స్కూల్ డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి, కరస్పాండెంట్ కెల్ల గోవింద, ప్రిన్సిపాల్ ఎస్.గౌరు నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.


విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం


సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది

సామూహిక సూర్య నమస్కారాలు

ఎచ్చెర్ల: రథసప్తమి సందర్భంగా రాజీవ్‌గాంధీ యూనివర్సిటీలో ఘనంగా సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ మాట్లాడుతూ సూర్య నమస్కారాలు నిత్యం సాధన చేయటం వలన శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అలాగే విద్యార్థుల్లో మనోధైర్యం, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక భావాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్ బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరి నాయుడు, యోగా విభాగపతి డాక్టర్ ఈశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా అందజేత

శ్రీకాకుళం అర్బన్: ఎస్‌బిఐ వేతన ఖాతా ద్వారా ఉచిత ప్రమాద బీమా పొందవచ్చని శ్రీకాకుళం ప్రాంతీయ మేనేజర్ టిఆర్‌ఎమ్ రాజు అన్నారు. ఇటీవల ప్రమాదం వలన మృతి చెందిన సారవకోట మండలం అంగూరు గ్రామానికి చెందిన సిఆర్‌పిఎఫ్ ఉద్యోగి లింగుబేరి రవి భార్య రోహిణికి రూ.50 లక్షల ఉచిత ప్రమాద భీమా మొత్తాన్ని చెక్కురూపంలో ఆయన అందజేశారు. కార్యక్రమంలో నరసన్నపేట చీఫ్ మేనేజర్ రుప్ప సురేష్, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

పలాస: వ్యవసాయ ఆధారిత భారతదేశంలో సాంప్రదాయాలకు భిన్నంగా బిజెపి ప్రభుత్వం రైతుల నడ్డి విరిచి కార్పొరేట్లకు కొమ్ముకాస్తుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ జీవితేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధరలు కల్పించాలన్నారు. ప్రధానమంత్రి గతంలో ఇచ్చిన హామీలు, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈయన వెంట సాసుమాను శ్యాం ఉన్నారు.


అధిక లోడుతో గడ్డిని తరలిస్తున్న ట్రాక్టర్

ప్రమాదకరంగా గడ్డి ట్రాక్టర్లు

బూర్జ: మండలంలో పలు గ్రామాల్లో తరలిస్తున్న గడ్డి ట్రాక్టర్లతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. పగలు, రాత్రిని తేడా లేకుండా ట్రాక్టర్‌పై అధిక లోడు వేసి వెళ్తుండటంతో ఎదురుగా వచ్చిన వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు చోటుచేసుకునే సందర్భాలున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధిక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లను అరికట్టి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

పర్లాకిమిడి: సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఎఐకెఎస్, ఎఐకెఎంఎస్, జెడ్‌ఆర్‌సిఆర్‌ఎస్, బికెఎంయు సంఘాలు ఐక్యంగా పర్లాకిమిడి, కాశీనగర్ పట్టణాల్లో శుక్రవారం చేపట్టిన గ్రామీణ బంద్ విజయవంతమైంది. పర్లాకిమిడిలో పాత కోర్టు వద్ద, కాశీనగర్ స్టేట్ బ్యాంకు వద్ద, గుమ్మాబ్లాక్ పరిధి పంచాయతీ మణిగూడ వద్ద ర్యాలీ నిర్వహించారు. పర్లాకిమిడి కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ నుంచి పాత కోర్టు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముచ్చి బంగారు, కేదార్ సబర్, రొక్కం లోకనాథం, జగన్నాథం, శ్రీను బెహరా, పైలా మురళి, జోనేష్ మేది, సాంబ సబర్, కార్తీక సబర్, నర్సింగ్ మాల బిసోయి పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

కల్లుగీత వృత్తిని నమ్ముకున్న గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలనిఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు, జిల్లా కార్యదర్శి దుబ్బ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘాల సొసైటీలను సందర్శించారు. రణస్థలం సొసైటీ గీత కార్మికుడు ముడసల శ్రీను చెట్టుపై నుంచి జారిపడి కాలు విరిగిపోయి మంచాన పడడంతో ఆయనను పరామర్శించారు. ప్రమాదం జరిగి నేటికి 50 రోజులు దాటినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ గీత కార్మికులకు రావలసిన


మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఎక్స్‌గ్రేషియో ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. శ్రీను కాలు విరిగి మంచాన పడడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందన్నారు. కల్లుగీత వృత్తిని నమ్ముకున్న గీత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు.

కార్యదర్శులకు అధికారాలు కల్పించడంపై హర్షం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పరిపాలన బాధ్యతలు డ్రాయింగ్ అండ్ డిస్బర్స్మెంట్ ఆఫీసర్ (డిడిఒ) అధికారాలు కల్పించి జిఒ నెంబర్ 11 ఇవ్వడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి గ్రామవార్డు సచివాలయాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (384/2022) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న సుమారు 6,500 కార్యదర్శులు గత నాలుగున్నరేళ్లగా డిడిఒ అధికారం కొరకు ఎదురు చూస్తున్నారని నేటికి వారి కల నిజమయ్యిందన్నారు. ఈ సమస్య పట్ల ప్రభుత్వానికి తమ సంఘం తరపున పలుమార్లు విన్నవించామని ప్రభుత్వం నేడు స్పందించడం శుభ పరిణామమన్నారు. ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించేందుకు ఈ జిఒ సహకరిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఐఆర్ లేదా 12వ పిఆర్‌సి వెంటనే ప్రభుత్వం ఇవ్వాలని కోరారు.

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ డిక్కల తిరుమలరావు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న 55 మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా మండలానికి కేటాయించారని అన్నారు. వారికి కేటాయించిన సచివాలయంలో సెక్రటరీ సూచనల మేరకు పనినేర్చుకోవాలని సూచించారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు అవసరమైన అనుభవాన్ని పొందవచ్చన్నారు.


మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

మూడు నెలలు పాటు విద్యార్థులు ఇంటర్న్ షిప్ కోర్స్ విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో పలు వార్డుల్లో వైసిపి నాయకులు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ సమక్షంలో టిడిపిలో చేరారు. గదేల లక్ష్మి ఆధ్వర్యాన ఆమె సగృహంలో 15 కుటుంబాలకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టోలో పొందుపర్చిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి వెళ్తున్నాయని వాటిని ఆకర్షించి పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న శంకర్

రాజ్యం, దొండపాటి నవీన్ కుమార్, గురుగుబెల్లి కమలనాథ్, పొన్నాడ కిషోర్, కొర్ను సురేష్ పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం


వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి - సీతానగరం

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సచివాలయం వ్యవస్థతోనే సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. మండలంలోని తామరఖండిలో రూ.43లక్షల నిధులతో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రక్షితమంచినీటి పథకాన్ని, బోరును ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో గ్రామంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా నేరుగా ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. అలాగే గ్రామంలో వందల మీటర్ల సిసి కాలువలు, రోడ్లతో పాటు నాడు-నేడు ద్వారా పాఠశాలను అభివృద్ధి చేశామని, ఇంటింటికి కుళాయిలు ద్వారా తాగు నీరు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బలగ రవణమ్మ, బలగ శ్రీరాములు నాయుడు, జెడ్పిటిసి మామిడి బాబ్జీ, మండల వైసిపి అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, ఎఒ ప్రసాద్, ఎంపిటిసి ఏగిరెడ్డి గౌరీశ్వరి శ్రీనివాసరావు, సర్పంచ్ వెంకటనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు మూడడ్ల మన్మధరావు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో గెడ్డలుప్పి, తామరకండి, ఆర్.వెంకంపేట, చినబోగిలి గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న వాలంటీర్ల సేవలను కొనియాడారు. తామరఖండి సచివాలయం ప్రారంభం అనంతరం ఆ వేదికపై వారందరినీ ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి, సన్మానించారు.


శంకుస్థాపన చేస్తున్న రాజ్యలక్ష్మి

అభివృద్ధి పనులు వేగవంతం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతానికి అధికారులు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ఆదేశించారు. పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. 17వ వార్డులో రూ.3 లక్షలతో లాలాపేట మజీద్ రోడ్, ఆరో వార్డులో రూ.లక్ష నిధులతో సిందిరి, పొందర వీధిల్లో కల్వర్టు, బాపూజీ గ్రంథాలయం వద్ద రూ.1.18 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బెంక లక్ష్మి, పరపటి మంజులత, టౌన్ ప్రెసిడెంట్ ప్రకాశరావు పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ నల్లి రమేష్, వైసిపి నాయకులు పరపటి కోటి, పిలక సంతోష్, బెంక లోకేష్, సఫీ, మున్సిపల్ ఎఇ కామేష్ పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

రూ.పది వేల ఆర్థికసాయం

సంతబొమ్మాళి: మండలంలోని వల్లేవలస, సంతబొమ్మాళికి చెందిన అల్లం కోటిలు ఇటీవల తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మనబడి వెల్ఫేర్ అసోసియేషన్, వల్లేవలసను ఆశ్రయించారు. అమెరికాలో ఉద్యోగ రీత్యా నివాసం ఉంటున్న శిర్ల కిరణ్ కుమార్ రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. దీనిని మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి, అప్పన్న, జగదీష్, కంటయ్య, గౌరి, వెంకట రమణ పాల్గొన్నారు.

22 దుకాణాలపై కేసు నమోదు

శ్రీకాకుళం: స్టేట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ హనుమంతు అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో సోంపేట, పలాస, కోటబొమ్మాళి మండలాల్లో మొత్తం 50 దుకాణాల్లో సంబంధిత అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా 22 దుకాణాల యజమానులపై కేసు నమోదు చేశారు. 4 వైన్ షాపులు, 5 సూపర్ మార్కెట్లు, 2 గ్యాస్ గొడౌన్లు, 3 ఆయిల్ షాపులు, 4 చేపల దుకాణాలు, 3 కిరాణా షాపులపై కేసులు నమోదు చేశారు. వ్యాపారాలు ఎలాంటి మోసాలకు పాల్పడకుండా తనిఖీలు చేపడుతున్నట్లు విజయనగరం డిప్యూటీ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ బి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వినియోగదారులకు ఎలాంటి మోసాలకు జరగకుండా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్.ఎం.రాధాకృష్ణ, ఎన్.వి.రమణమూర్తి, పివిడి అప్పలరాజు, ఇన్‌స్పెక్టర్లు బా.భాస్కరరావు, ఎ.బలరామకృష్ణ, పలాస ఇన్‌స్పెక్టర్ కె.రాజారమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సచివాలయం ప్రారంభం

టెక్కలి రూరల్: మండలంలోని చాకిపల్లిలో రూ.40 లక్షల ఖర్చుతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం శనివారం ప్రారంభిస్తున్నామని సర్పంచ్ సర్పంచ్ వాన తవిటియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భవనాన్ని వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.